
# పోతనభాగవతంలో రసగుళికలు

## – ఆర్.శర్మ దంతుర్తి



## 120 వ భాగం

## పురంజనోపాఖ్యానం 13

రుద్రుడు ప్రచేతసులకి దీక్ష ఇస్తూ చెప్పాడు కదా, ముందు భగవంతుడి గుణాలు, తర్వాత ఆయన రూపు ఎలా ఉంటుందో? ఇప్పుడు చెప్తున్నాడు భగవన్మహిమ గురించి. ఈ పద్యాల్లో కూడా పోతన – ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై.. అన్నది మరోసారి విశ్వరూపంగా వర్ణిస్తున్నాడు గమనించండి.

సీ. అరయంగ నేమిటి యందు నీ విశ్వంబు
విదితమై యుండు? నీ విశ్వమందు
నేది ప్రకాశించు? నెప్పుడు నట్టి స్వ
యంజ్యోతి నిత్యంబు నవ్యయంబు
నాకాశమును బోలి యవిరళ వ్యాపక
మగు నాత్మతత్త్వంబు నధిక మహిమ
నమరు పరబ్రహ్మ మగు నని పల్కి యి
ట్లనియె నవిక్రియుండైన వాఁడు [4-720]

తే. నెవ్వఁ డాతఁడు దనయందు నెపుడు నాత్మ
కార్యకరణ సమర్థంబు గాని భేద
బుద్ధి జనకంబు నాఁదగు భూరిమాయఁ
జేసి విశ్వంబు సత్యంబుగా సృజించె. [4-720.1]

ఈ విశ్వం దేని లోపల (పధ్నాలుగు లోకాలు తన ఉదరం లోనే ఉన్న భగవంతుడిలోపలే కదా) ప్రకాశిస్తుందో, ఈ విశ్వం లోపల ఏది ప్రకాశిస్తుందో (ఆత్మవతత్సర్వభూతాని – ఉన్నది ఒకటే చూసినవాళ్ళు దాన్ని అనేక విధాలుగా వర్ణిస్తున్నారు – లేదా ఏకం సత్ విప్రా బహుధా వదంతి) అటువంటి, స్వయంజ్యోతి, నిత్యం, అవ్యయం అయిన ఆత్మస్వరూపం వికారం లేనిది. అటువంటి భగవంతుడు తన భూరి – గొప్పదైన, భేధబుద్ధిని కలిగించే మాయతో ఈ సమస్త లోకాలనీ నిజంగా సృష్టించాడు. దీనినే  పోతన వామనావతారంలో చెప్పాడు, మాయని కల్పించే భగవంతుడు ఎలా ఉంటాడో అనేది – అది మరోసారి చూద్దాం. ఈ విశ్వం భగవంతుడు తప్ప మరొకటి కాదు అనేది ఎంత సులభంగా చెప్పాడో గమనించండి, వామనావతారంలో వామనుడు విజృంభించినపుడు.

వ.ఇట్లు విష్ణుండు గుణత్రయాత్మకంబగు విశ్వరూపంబుధరియించి భువియును, నభంబును, దివంబును, దిశలును, దిశాఛిద్రంబులును, సముద్రంబులునుఁ, జలదచల భూతనివహంబులుం దానయై యేకీభవించి, క్రమక్రమంబున భూలోకంబునకుం బొడవై భువర్లోకంబు నతిక్రమించి, సువర్లోకంబును దలకడచి, మహర్లోకంబు దాఁటి, జనలోకంబునకు మీఁదై, తపంబునకు నుచ్చ్రితుండై, సత్యలోకంబు  కంటె నౌన్నత్యంబు వహించి, యెడ లిఋములు సందులు రంధ్రములు లేకుండ నిండి, మహాదేహ మహితుండై చరణతలంబున రసాతలంబునుఁ, బాదంబుల మహియును, జంఘల మహీధ్రంబులును, జానువులఁ బతత్త్రిసముదయంబులును, నూరువుల నింద్రసేన మరుద్గణంబులును, వాసస్థలంబున సంధ్యయు, గుహ్యంబునఁ బ్రజాపతులును, జఘనంబున దనుజులును, నాభిని నభంబును, నుదరంబున నుదధిసప్తకంబును, నురంబున దారకానికరంబును, హృదయంబున ధర్మంబును, నురోజంబుల ఋతసత్యంబులును,  మనంబునఁ జంద్రుండును, వక్షంబున గమలహస్త యగు లక్ష్మియుఁ, గంఠంబున సామాది సమస్త వేదంబులును, భుజంబులఁ బురందరాది దేవతలునుఁ, గర్ణంబుల దిశలును, శిరంబున నాకంబును, శిరోజంబుల మేఘంబులును, నాసాపుటంబున వాయువును, నయనంబుల సూర్యుండును, వదనంబున వహ్నియు, వాణినఖిలచ్ఛందస్సముదయంబును, రసనంబున జలేశుండును, భ్రూయుగళంబున విధినిషేధంబులును, ఱెప్పల నహోరాత్రంబులును, లలాటంబునఁ గోపంబును, నధరంబున లోభంబును, స్పర్శంబునఁ గామంబును, రేతంబున జలంబును, బృష్ఠంబున నధర్మంబును, గ్రమణంబుల యజ్ఞంబులును, ఛాయల మృత్యువును, నగవులవలన ననేక మాయావిశేషంబులును, రోమంబుల నోషధులును, నాడీప్రదేశంబుల నదులును, నఖంబుల శిలలును, బుద్ధి నజుండును, బ్రాణంబుల దేవర్షిగణంబులును, గాత్రంబున జంగమ స్థావర జంతు సంఘంబులును గలవాఁడయి, జలధరనినద శంఖ శార్ఙ్గ సుదర్శన గదాదండఖడ్గాక్షయ బాణతూణీర విభ్రాజితుండును, మకరకుండల కిరీట కేయూర హార కటక కంకణ కౌస్తుభమణి మేఖలాంబర వనమాలికా విరాజితుండును, సునంద నంద జయ విజయ ప్రముఖ పరిచర వాహినీ సందోహరివృతుండును, నమేయతేజోవిరాజితుండును, నై బ్రహ్మాండంబు దన మేనికప్పు తెఱంగున నుండ విజృంభించి.

[8.624]

ఆ. మరలఁమరలఁ బెక్కుమాఱు లీ విశ్వంబు
జనన వృద్ధి విలయ సంగతులను
నందఁ జేయుచుండు నట్టి యీశ్వరుఁడవై
తనరు నిన్ను నాత్మ తత్త్వముగను. [4-721]

ఈ విశ్వం అనేకసార్లు జనించడానికీ, వృద్ధిపొందడానికీ లీనం అవడానికీ కారణం ఈశ్వరుడివైన నువ్వే.

వ. "…. యోగపరాయణు లగువారు శ్రద్ధా సమన్వితులై క్రియాకలాపంబుల నంతఃకరణోపలక్షితం బయిన భవదీయ రూపంబు యజింతురు; వారు వేదాగమతత్త్వ జ్ఞానులు; నీ వాద్యుండవును ననాదియు నద్వితీయుండవును మాయాశక్తి యుక్తుండవును నై విలసిల్లు చుండుదు; వట్టి మాయాశక్తి చేత. [4-722]

సీ. చతురాత్మ! సత్త్వరజస్తమోగుణములు
వరుస జనించెను; వానివలన
మహదహంకార తన్మాత్ర నభోమరు
దనల జలావని ముని సుపర్వ
భూతగణాత్మక స్ఫురణ నీ విశ్వంబు
భిన్న రూపమున నుత్పన్న మయ్యె;
దేవ! యీ గతి భవదీయ మాయను జేసి
రూఢిఁ జతుర్విధ రూపమైన [4-723]

తే. పురము నాత్మాంశమునఁ జెందు పురుషుఁ డింద్రి
యములచే విషయ సుఖము లనుభవించు;
మహిని మధుమక్షికాకృత మధువుఁ బోలి
యతనిఁ బురవర్తి యగు జీవుఁ డండ్రు మఱియు. [4-723.1]

మొదట పుట్టినవి సత్వ రజ స్తమోగుణాలు. వాటిలోంచి పుట్టినది అహంకారం, అయిదు తన్మాత్రలు కలిగాయి. అక్కడనుంచి, ఆకాశం, అగ్ని, వాయువు, నీరు, భూమి. అందులో నుంచి ఋషులు దేవతలు వగైరాలతో భూతగణం పుట్టింది (భూతగణాత్మక స్ఫురణ నీ విశ్వంబు) భిన్న మైన రూపంతో. అలా చతుర్విధమైన రూపంతో దేహంలో ఆత్మ ప్రవేశించి విషయ సుఖాలు అనుభవిస్తుంది. దేహమనే పురంలో తేనెను తాగినట్టు, పురవర్తి – మనుషుడు ప్రవర్తిస్తాడు.

చ. అనిశము నస్మదీయగురుఁడైన సరోరుహ సంభవుండు న
మ్మనువులు నాత్మసంశయము మాని భజించు భవత్పదాబ్జముల్
మనమున నిల్పి యుష్మదవమాన మహావ్యథఁ జెందునట్టి స
జ్జనుఁడు పరిత్యజించునె? భుజంగమతల్పక! భక్తకల్పకా! [4-730]

అన్నివేళలా సరోరుహ సంభవుండు – పద్మంలో పుట్టినవాడు, బ్రహ్మదేవుడు, మనువులు, అన్ని సంశయాలు కట్టిపెట్టి నీ పాదపద్మాలని భజిస్తూ ఉంటారు. అటువంటి నిన్ను, సజ్జనుడు తనకి అవమానం జరిగినా విడిచిపెట్టడు కదా? ఈ పద్యంలో విష్ణువుని ఏమన్నాడో గమనించారా? భుజంగమతల్పక – భుజంగము – పాము, తల్పక – శయనంగా కలవాడు – శేషతల్పుడు, విష్ణువు, భక్తులకి కల్పవృక్షం లాంటివాడు, భక్త వత్సలుడు (భక్త కల్పకా).

క. కావున నాకును సూరి జ
నావళికిని సర్వసంశయంబులు వాపం
గావను బ్రోవను దగు గతి
నీ వని వినుతించి నట్టి యీ స్తవ మెలమిన్. [4-731]

ఇదీ మీరు చేయవల్సిన స్తవం/స్తుతి. నాకును (శివుడు కదా చెప్తున్నాడు), సూరి జనావళి (పండితులకి) అన్ని సంశయాలు పోగొట్టే వాడు శ్రీహరి కనక, ఈ రీతిలో ఈ స్తవం చేయండి.

వ. రుద్రుండు ప్రచేతసుల కెఱిగించి వెండియు నిట్లనియె "ప్రచేతసులారా! యిట్టి యోగాదేశ నామకంబైన యీ స్తోత్రంబు బహువారావృత్తిచేఁ బఠించి మనంబున ధరియించి సమాహిత చిత్తులై మీరందఱు నాదరంబున విశ్వాసయుక్తులును, స్వధర్మాచారవంతులును, భగవదర్పితాశయులును నై జపియించుచు సర్వభూతావస్థితుండు నాత్మారాముండు నైన సర్వేశ్వరుని నుతించుచు ధ్యానంబు చేయుచుఁ బూజించుచుండుఁడు; తొల్లి యీ స్తోత్రంబు భగవంతుండైన పద్మసంభవుండు సిసృక్షు వగుచు నాత్మజులమైన మాకును సృజియింప నిచ్ఛగించు భృగ్వాదులకును నెఱింగించె; మేము నా భృగ్వాదులును బ్రజాసర్గంబు నందు బ్రహ్మచోదితులమై యీ స్తోత్రంబునం జేసి విధ్వస్త సమస్త తమోగుణులమై వివిధ ప్రజాసర్గంబు గావించితిమి; కావున నీ స్తోత్రంబు నెల్లప్పుడు నేకాగ్రచిత్తుండును వాసుదేవ పరాయణుండు నై యెవ్వండు జపియించు, వాఁడు వేగంబె శ్రేయస్సును బొంది తదీయ జ్ఞాన ప్లవంబున వ్యసనార్ణవ రూపంబయిన సంసారంబును సుఖతరంబుగఁ దరియిం; చట్టి మదుపదిష్టం బయిన యీ శ్రీహరి స్తవంబు నెవ్వండు చదువుచు దురారాధ్యుం డైన శ్రీహరిం బూజించు, వాఁడు మదుక్త స్తోత్ర గాన సంతుష్టుండును శ్రేయస్సులకు నేకాశ్రయ భూతుండును నగు; శ్రీమన్నారాయణుని వలన సమస్తాభీష్టంబులం బొందు; నెవ్వండేనిఁ బ్రభాతంబున లేచి ప్రాంజలియు శ్రద్ధాసమన్వితుండు నై యీ మంగళస్తవరాజంబును వినిన వినిపించినం గర్మబంధ విముక్తుం డగు;" నని మఱియు నిట్లనియె. [4-732]

మొదట్లో భగవంతుడి గుణగణాలు, తర్వాత రూపం, ఆ పైన భగవంతుడి మహిమా చెప్పి స్తవం ఉపదేశించాడు. అయితే ఈ దీక్ష వల్ల ఏమిటి ప్రయోజనం మనసు పెట్టి సాధన చేయకపోతే? అందువల్ల ఇప్పుడు చెప్తున్నాడు – సమాహిత చిత్తులై, స్థిరమైన మనసుతో విశ్వాసయుక్తులై – భగవంతుడు కనిపించి తీరుతాడు అనే విశ్వాశంతో, మీ ధర్మం పాటిస్తూ ధ్యానం చేస్తూ పూజిస్తూ ఉండండి. అయితే అలా సాధన చేస్తే కనిపిస్తాడా అనే ప్రశ్న ఉదయించవచ్చు కనక ఈ స్తవం గొప్పదనం చెప్తున్నాడు. మొదట్లో భగవంతుడు సృష్టి మొదలుపెట్టినప్పుడు మాకూ, భృగువు వంటి వారికీ ఈ స్తవం ఉపదేశించాడు. అందువల్ల మేము భగవంతుణ్ణి తెలుసుకో గలిగాం. ఇదే విషయం బుద్ధుడు చెప్పడం కూడా గమనించవచ్చు – ప్రపంచంలో ఏ ఒకరు చేసిన పనైనా మరొకరు చేయవచ్చు, బ్రహ్మ జ్ఞానం ఒకరికి కలిగింది అంటే మిగతావారిక్కూడా బ్రహ్మ జ్ఞానం తెలుసుకోవడానికి ఆస్కారం ఉంది కానీ సాధన చేయకపోతే ఎవరూ కూడా బ్రహ్మన్ని తీసుకొచ్చి మీ అరచేతిలో పెట్టలేరు. మాకు జరిగినట్టే మీకు కూడా భగవంతుడు కనిపిస్తాడు. ఎవరైతే దీన్ని శ్రద్ధాసక్తులతో చదువుతాడో వాడికి శ్రీహరి వల్ల కర్మబంధాలు తొలగిపోతాయి.

క. నరదేవతనయులారా!
పురుషాధీశుండు పరమ పురుషుఁడు నగు నీ
శ్వరు సుస్తోత్రము మీ కా
దరమునఁ దెలిపితిని; మీరుఁ దద్దయు భక్తిన్. [4-733]

క. ఏకాగ్రచిత్తులును సు
శ్లోకులునై జపము చేయుచును ఘనతపముం
గైకొని చేసిన మీకును
జేకుఱు మహితేప్సితార్థ సిద్ధి గడంకన్. [4-734]

పరమపురుషుడైన (భగవంతుడైన శ్రీహరి) స్తోత్రం మీకు చెప్పాను. ఏకాగ్ర చిత్తంతో జపం చేస్తూ ఉండండి. అలా చేస్తే మీక్కూడా సిద్ధి కలుగుతుంది. ఇలా చెప్పి రుద్రుడు తన దారిన తాను వెళ్ళాడు.

తే. తివుట వారలు రుద్రోపదిష్టమైన
యచ్యుతస్తవము జపించు చయుత సంఖ్య
వత్సరము లుగ్ర తపము దుర్వార వారి
మధ్యమునఁ జేయుచున్న సమయమునందు. [4-737]

దీక్ష ఇచ్చినవాడు సాక్షాత్తూ పరమేశ్వరుడు. అందువల్ల ఈ ప్రచేతసులు ఈ అచ్యుత స్తవం (అచ్యుతుడు అంటే చ్యుతి, పతనము లేనివాడు, విష్ణువు) చేస్తూ ఉగ్రమైన తపస్సు మొదలుపెట్టారు. ఎంతకాలం? ఆయుత సంఖ్య – పదివేల సంవత్సరాలు. ఎక్కడ? దుర్వార – దారుణమైన, వారి మధ్యమున – నీటి మధ్యలో. వీళ్ళ సంగతి అలా ఉంది. కొడుకులు ఇలా తపస్సు చేస్తున్నప్పుడు వారి తండ్రి ప్రాచీనబర్హికి ఏమైందనేది వచ్చేవ్యాసం నుంచీ చూద్దాం.

పోతన భాగవతం ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS